సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

శివయ్యకు అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో శివలింగం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో శ్రీ వైష్ణవి కుంభేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శివ లింగాన్ని పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: ఎండలు తీవ్రంగా మండిపోతున్న తరుణంలో చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్ద పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం ఆధ్వర్యంలో వైద్యులు సునీల్ సహకారంతో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. దుర్గాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, పద్మశాలీ ఆత్మీయ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పల రామ్‌కుమార్, సంఘం అధ్యక్షులు కొప్పల వెంకట నాగేశ్వరరావు తదితరులు పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు పి.నాగేశ్వరరావు, పి.రామస్వామి, యు.శ్రీనివాస్, దుర్గాలమ్మ ఆలయ కమిటీ కార్యదర్శి నాగోతి తాతారావు, కోశాధికారి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పద్మనాభం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ టీడీపీ శ్రేణులు సోమవారం పద్మనాభం సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కె.రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, కె.లీలావతి, పి.అప్పలనాయుడు, గంగరాజు పాల్గొన్నారు.

సచివాలయ ఇన్‌చార్జిపై ఫిర్యాదు

తగరపువలస: భీమిలి జోన్ పరిధిలోని ఒక వార్డు సచివాలయ ఇన్‌చార్జి తమను వేధిస్తున్నాడంటూ అయిదుగురు వలంటీర్లు జెడ్సీ బి.రాముకు సోమవారం ఫిర్యాదు చేశారు. రాత్రి 11 తర్వాత ఫోన్ చేయడం, శరీరంపై చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. వలంటీర్లతో ఫిర్యాదు చేయించిన వారిలో సిటు నాయకులు ఉన్నారు. దీనిపై భీమిలి ఏపీడీ రాము సంబంధిత సచివాలయంలో జెడ్సీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సచివాలయ ఇన్‌చార్జి వివరణ కోరగా మ్యారేజ్ సర్టిఫికెట్‌కు సంబంధించిన వివాదంలో ఒకరు తనపై కక్ష పెంచుకుని తప్పుడు ఫిర్యాదు చేయించారని ఆరోపించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీ నగర్‌లో కల్లుగీత కార్మిక కుటుంబానికి చెందిన బాడితబోయిన లక్ష్మీ కుమారి (15) అనే విద్యార్థిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 7న లక్ష్మీ కుమారి తల్లి గౌరి కల్లు వ్యాపారానికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చింది. ఆ సమయంలో కుమార్తె ట్యాబ్ చూస్తూ కాలం గడుపుతుండటంతో మందలించింది. ఇంటి పనుల్లో సాయం చేయాలని సూచించింది. తర్వాత భర్త శంకర్‌కు టిఫిన్ తీసుకురావడానికి గౌరి బయటకు వెళ్లి ఇంటికి వచ్చి చూడగా... కుమార్తె లక్ష్మీకుమారి ఇంట్లో ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే కుమార్తెను చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఈ నెల 9న రాత్రి కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విస్తృతంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



రేఖవానిపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో స్టిక్కర్లతో కన్వీనర్లు, గృహసారథులు



లొడగలవానిపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు



గాంధీబొమ్మ వీధిలో సర్వే చేస్తున్న కన్వీనర్లు, గృహసారథులు

తగరపువలస: మా భవిష్యత్తు నువ్వే జగన్ అంటున్నారు భీమిలి అర్బన్, రూరల్ ప్రజలు. మా నమ్మకం నువ్వే జగన్ సర్వేలో భాగంగా గృహ సారథులు, కన్వీనర్లు ఇంటింటా జరుపుతున్న సర్వేలో ప్రజల నుంచి వస్తున్న స్పందన ఇది. 2019 ఎన్నికలకు ముందు రావాలి జగన్.. కావాలి జగన్ అంటూ కోరిన ప్రజలు ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కారణంగా ఇప్పుడు మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారు. సోమవారం జరిగిన ఇంటింటా సర్వేలో భాగంగా భీమిలి మండలం రేఖవానిపాలెంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పీతల గంగ శ్రీను, పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లేటి హరిశంకర్, కన్వీనర్ పలపాల పద్మ పాల్గొన్నారు. చిప్పాడలో గృహసారథులు, కన్వీనర్లు సర్వే చేశారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్, గాంధీబొమ్మ వీధుల్లో వార్డు కన్వీనర్ జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. సంతపేట రెండో వార్డులో చిప్పాడ వెంకటేష్, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల ప్రమీల, రాయపాలెంలో శీరపు శ్రీరాములు, ఎరుసు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించి ప్రజల ఆశీర్వాదాలు పొందడానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, నాయకులు ఇంటింటికీ వెళ్లి నవరత్నాల పథకాలను వివరిస్తున్నారు. టీడీపీ పాలనలో మోసపోయిన విధానాలను, వైఎస్సార్ సీపీ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని వివరిస్తున్నారు. కరపత్రాలు అందించి, ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అంటిస్తున్నారు. లొడగలవానిపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు రౌతు వెంకటరావు, సర్పంచ్ లొడగల రాజేశ్వరి, లొడగల రమణ, బంక సూర్యనారాయణ, విజినిగిరి అప్పలనాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రజల మద్దతు కోరారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, దుర్గానగర్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి సీఎం జగన్ పాలనపై అవగాహన కల్పిస్తూ లబ్ధిదారుల అభిప్రాయాలు సేకరించారు. అదేవిధంగా గోడలకు, సెల్ ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో మాదు బుజ్జి, అల్లాడ ఉమా మహేశ్వరరావు, మాదు చంటి, పాపారావు పాల్గొన్నారు.

మధురవాడ: జగనన్న సంక్షేమ పథకాలతో తమకు ఎంతో మేలు జరుగుతోందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జోన్ – 2లోని సచివాలయాల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నాలుగో రోజు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. వీరు ఇంటింటికీ వెళ్లి తలుపులకి స్టిక్కర్లు అంటించి, ప్రభుత్వ పథకాలు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. చంద్రంపాలెం 59వ నంబరు సచివాలయం పరిధిలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు పిళ్లా సూరిబాబు, పోతిన పైడిరాజు, పీస రామారావు, పిళ్లా అప్పన్న, నాగోతి శాంతి ఇంటింటికీ వెళ్లి ప్రజల మద్దతు కోరారు. కళానగర్ 61వ సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ 7వ వార్డు మహిళా అధ్యక్షురాలు చేకూరి రజని ఆధ్వర్యంలో చిన్నారావు, అచ్చియ్యపాత్రుడు తదితరులు విస్తృతంగా ప్రచారం చేశారు.



రేఖవానిపాలెంలో సర్వే చేస్తున్న గృహసారథులు, కన్వీనర్లు



ఎండాడలో మహిళకు స్టిక్కర్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చంద్రంపాలెంలో మహిళకు కరపత్రం అందిస్తున్న నాయకులు

రైతులకు ఎల్‌పీవోలు ఇచ్చి న్యాయం చేస్తాం

గ్రామసభలో ఆర్డీవో భాస్కరరెడ్డి



విచారణ చేపడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

పద్మనాభం: ల్యాండ్ పూలింగ్‌లో అవకతవకలు జరిగాయని విశాఖపట్నం కలెక్టరేట్ స్పందనలో ఇటీవల పలువురు రైతులు చేసిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో భాస్కరరెడ్డి నరసాపురంలో సోమవారం గ్రామసభ నిర్వహించి విచారణ చేపట్టారు. మండలంలోని గంధవరం, తునివలస పంచాయతీ నరసాపురంలో ల్యాండ్ పూలింగ్‌లో అవకతవకలు జరిగాయని రైతులు పిర్యాదు చేశారు. దీనిపై రైతులను ఆర్డీవో భాస్కరరెడ్డి సోమవారం విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంధవరం – 3వ లే అవుట్ కోసం కొంత మంది నుంచి ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకున్నామని, వారికి ఎల్‌పీవోలు ఇవ్వాల్సి ఉందని, త్వరలో ఇస్తామన్నారు. గంధవరం – 2వ లే అవుట్‌లో కొంత మందికి డీ పట్టా భూమి ఉందని, కారిడర్ నంబర్, సర్వే నంబర్‌తో పాస్ పుస్తకాలు ఉండడం వల్ల ఇది డీ పట్టా కాదనుకున్నామన్నారు. వీరికి కూడా ఎల్‌పీవోలు ఇచ్చి న్యాయం చేస్తామని తెలిపారు. రైతులకు చిన్న చిన్న వ్యక్తిగత సమస్యలు ఉన్నాయని, వాటన్నింటినీ 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవల్లీ, ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణమూర్తి రాజు పాల్గొన్నారు.

పైడిమాంబ ఉత్సవాలు ప్రారంభం



గంధవరంలో పైడిమాంబ విగ్రహం

పద్మనాభం: మండలంలోని గంధవరంలో సోమవారం రాత్రి గొర్రె పోతు సంబరంతో పైడిమాంబ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 101 దివిటీలతో ఈ సంబరం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పాలధార తిరగడంతోపాటు బళ్ల వేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. గ్రామంలో ఉత్సవ శోభ నెలకొంది.

తోబుట్టువులకు అండగా ఉందాం

తగరపువలస: తోబుట్టువులు మనకు మంచి స్నేహితులని, వారికి కష్టం కలగకుండా అండగా ఉందామని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు అన్నారు. సోమవారం ప్రపంచ తోబుట్టువుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు తోబుట్టువుల ఆవశ్యకతను వివరించారు. క్షణికావేశంలో గొడవల కారణంగా విడిపోయినా అమ్మానాన్నల తర్వాత మన అభివృద్ధిని ఎక్కువగా కాంక్షించేది తోబుట్టువులేనన్నారు. ఉపాధ్యాయురాలు పిన్నింటి నాగమణి పాల్గొన్నారు.

కాలువ కబ్జాదారులపై చర్యలకు డిమాండ్



భీమిలి తహసీల్దార్ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలస సర్వే నంబర్ 68/41లోని 524, 525, 527 డాక్యుమెంట్లకు చెందిన 5.03 ఎకరాలకు అనుబంధంగా సుమారు 50 అడుగుల వెడల్పుతో ఉన్న తాబేలు బందను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు సోమవారం తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, జెడ్సీ బి.రాముకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే సర్వేనంబర్‌లో పూర్వం జీరు అప్పలస్వామి, జీరు నాయుడు, చిల్ల అప్పలనరసమ్మ కలిపి మొత్తంగా 5.03 ఎకరాలు కొనుగోలు చేసి దక్షిణం వైపు చిల్లపేట – మూలకుద్దు గల్లీరోడ్డును హద్దుగా డాక్యుమెంట్లలో నమోదు చేసుకున్నారన్నారు. చిట్టివలస, చిల్లపేట, జీరుపేట తదితర 14 గ్రామాల నుంచి ప్రవహించిన నీరు ఈ తాబేలు బంద గెడ్డ ద్వారా గల్లీరోడ్డు కింద నుంచి సముద్రం వైపు ప్రవహిస్తుందన్నారు. ఇటీవల జీరు అప్పలస్వామి వారసులు హద్దులలో ఉన్నవారిని సంప్రదించకుండా తమకు ఉన్న దానికంటే 17.5 సెంట్ల అదనపు భూమిని నగరానికి చెందిన దుర్గాప్రసాద్ అనే వైద్యునికి విక్రయించారన్నారు. సదరు వైద్యుడు ప్రస్తుతం తాబేలు బందను గ్రావెల్‌తో పూడ్చి భీమిలికి చెందిన ఒక విద్యాసంస్థ యజమానికి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. బందను పూడ్చే క్రమంలో స్థానికంగా ఉన్న ఆరుగురు వ్యక్తులకు రూ.80 లక్షలు ఆశ చూపినట్టు ఆరోపించారు. బందను పూడ్చడం వల్ల వర్షం నీరు నిలిచి పంటభూములు, సమీప గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అడగడానికి వెళ్లే రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గెడ్డలకు రక్షణ కల్పించాలని జీరు గణేష్‌రెడ్డి, జీరు శ్రీనివాసరెడ్డి, జీరు మహేష్‌రెడ్డి, జేవీ ప్రసాద్‌రెడ్డి, సీహెచ్.ఈశ్వరరావు, జీరు పార్వతి, సీహెచ్.సూర్యకళ, జీరు చిన్నయ్య తెలిపారు.

శిథిల వంతెనతో భయాందోళనలు



శంభువానిపాలెం గ్రామంలోకి వెళ్లే రోడ్డులో రైలింగ్ లేని వంతెన

పీఎం పాలెం: నిర్మించిన తర్వాత కనీసం పట్టించుకోకపోవడంతో ఓ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి శంభువానిపాలెం గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డులో సుమారు 20 సంవత్సరాల కిందట రోడ్డు నిర్మాణంలో భాగంగా తుమ్మిరి గెడ్డ మినీ రిజర్వాయర్‌కు అనుబంధంగా ఉన్న చింతల గెడ్డపై వంతెన నిర్మించారు. వంతెనకు ఇరువైపులా రక్షణగా రైలింగ్ కూడా నిర్మించారు. అనంతరం నిర్వహణ లోపం, కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వంతెనకు రెండు వైపులా నిర్మించిన స్తంభాలలో ఒకటే దర్శనమిస్తోంది. మిగతా మూడూ నామరూపాలు లేకుండాపోయాయి. రక్షణ కోసం నిర్మించిన రైలింగ్ పైపులు ఎవరో ఎత్తుకుపోయారు. రైలింగ్ లేకపోవడంతో రాత్రి వేళల్లో ఈ వంతెన మీదుగా ప్రయాణించే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వంతెనకు రెండు వైపులా రైలింగ్ నిర్మించడంతోపాటు అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'స్పందన' వినతుల పరిష్కారానికి చర్యలు



భీమిలిలో వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము



మధురవాడ జోనల్ కార్యాలయంలో వినతిపత్రం తీసుకుని మాట్లాడుతున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

భీమునిపట్నం: జోన్ పరిధిలో ప్రజలు స్పందన కార్యక్రమంలో ఇచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జెడ్సీ బొడ్డేపల్లి రాము తెలిపారు. సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి నాలుగు, యూడీసీకి రెండు, రెవెన్యూ విభాగానికి ఒక వినతి వచ్చింది. వీటిపై ఆయన స్పందిస్తూ ఆయా విభాగాల ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఇతర రోజుల్లో కూడా సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు.

శ్మశానవాటికల్లో వసతులు కల్పించాలి

మధురవాడ: స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్ పరిధిలోని 9 వార్డుల నుంచి 11 అర్జీలు వచ్చాయి. శ్మశాన వాటికల్లో సమస్యలు పరిష్కరించాలని డానియల్ శ్యామ్, పాస్టర్ జిలానీ తదితరులు కోరారు. ఎండాడ శ్మశాన వాటికతోపాటు పీఎంపాలెం పరిసర ప్రాంతాల్లోని శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని ఈఎన్ఎస్ చంద్రరావు కోరారు. మల్లయ్యపాలెం గ్రామం, రోడ్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లాడ లింగేశ్వరరావు, బెల్లాపు పాపారావు, కరీమ్ కోరారు. అగ్ని ప్రమాదంలో కాలిపోయిన కమ్మల పాక నిర్మాణానికి అనుమతి ఇప్పించాలని జోజిబాబు తదితరులు కోరారు. స్వతంత్రనగర్‌లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేసిన కల్వర్టు, పార్కు పనులు తక్షణమే పూర్తి చేయాలని కాలనీ వాసులు కోరారు. సమస్యలపై తక్షణ చర్యలు చేపడతామని కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు.

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి



పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సభ్యులు

ఆనందపురం: క్రైస్తవ కుటుంబాల అభివృద్ధికి కృషి చేయనున్నట్టు ఆనందపురం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఆర్.ప్రభుదాస్ తెలిపారు. ఆనందపురం పూల మార్కెట్ వద్ద గల డేవిడ్‌రాజు చర్చిలో సోమవారం ఆనందపురం పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ప్రభుదాస్ మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు అందేట్టు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా శ్మశాన వాటికల సమస్య అన్ని గ్రామాల్లోనూ ఉందని, దీనిపై అధికారులకు వినతి పత్రాలు అందించి స్థలాల కేటాయింపు కోసం కృషి చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా రెవ జీఎస్ ప్రశాంత్ కుమార్, జంగం జోషి, రెవ ఎస్‌వీపీడీ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా ఎం.అబ్రహం, ఉపాధ్యక్షుడిగా పి.శాంతిరాజు, కార్యదర్శిగా వి.ఆనందరావు, సంయుక్త కార్యదర్శిగా బొత్స డేవిడ్, కోశాధికారిగా పి.హనోక్, కార్యవర్గ సభ్యులుగా గ్లోరీ పుష్ప, మినీ గ్లోరీ, ఎస్.పాల్, పీటర్ ఎన్నికయ్యారు.

జాగ్రత్తలతో ఆరోగ్యకర శిశువు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణిమ

భీమునిపట్నం: పుట్టబోయే శిశువు మంచి ఆరోగ్యంతో ఉండాలంటే గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ పూర్ణిమ సూచించారు. ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ)లో భాగంగా గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా వైద్యులు సూచించిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. రక్తహీనత, బ్లడ్ షుగర్, హెచ్ఐవీతోపాటు అవసరమైన ఇతర పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనలన్నీ పాటిస్తే ఆరోగ్యకర శిశువులు పుడతారని పేర్కొన్నారు. వైద్యులు డి.ప్రదీప్, హరిణి, గోవింద్, హెడ్ నర్స్ పి.రమణమ్మ పాల్గొన్నారు.

14 మంది విద్యార్థుల గైర్హాజరు

తగరపువలస: పదో తరగతి పరీక్షల్లో భాగంగా భీమిలి మండలంలోని 12 కేంద్రాల్లో సోమవారం జరిగిన గణితం పరీక్షకు 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 2,302 మందికి 2,288 మంది హాజరయ్యారు. చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్ కేంద్రంలో నలుగురు, సంగివలస శశి ఇంగ్లిష్ మీడియం స్కూల్ కేంద్రంలో ముగ్గురు, చిట్టివలస బాలికల హైస్కూల్, భీమిలి సెయింటాన్స్ కేంద్రాల్లో ఇద్దరేసి, చిట్టివలస హైస్కూల్, సంతపేట అంబేడ్కరు హైస్కూల్, భీమిలి పొట్టి శ్రీరాములు జీవీఎంసీ హైస్కూల్‌లో ఒక్కొక్కరు పరీక్షకు హాజరుకాలేదు.

ఇన్విజిలేటర్లకు కార్పొరేట్ సేవలు..

కొన్ని పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేషన్ సిబ్బందిని కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ ప్రత్యేకమైన సేవల ద్వారా ప్రసన్నం చేసుకుంటున్నాయి. బయట నుంచి మజ్జిగ, టీ, ఫలహారాలు, స్వీట్లు, నగదు బహుమతులు అందించి తమ పాఠశాలల విద్యార్థులు పరీక్ష చూసి రాసుకునేందుకు సహకరించేలా ప్రలోభపెడుతున్నారని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల తమకు నష్టం జరుగుతుందని అంటున్నారు. సోమవారం నాటి పరీక్షకు కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకు పలుచోట్ల ఇన్విజిలేటర్లు తమ వంతు సహకారం అందించారు.

ఎన్టీఆర్ కాలనీలో క్షీణించిన పారిశుధ్యం



ఎన్టీఆర్ కాలనీ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని మిథిలాపురి వుడా కాలనీ, ఎన్టీఆర్ కాలనీలను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు కనీసం పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. డ్రైనుల్లో చెత్త తొలగించకపోవడంతో కాలనీలో ఈగలు, దోమలు ముసురుతున్నాయని, వీటివల్ల రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై కార్పొరేటర్ లొడగల అప్పారావుకు కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన కాలనీలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు.

కొత్తరోడ్డు నిర్మాణంతో సురక్షితంగా రాకపోకలు



సుందరంగా మారిన భీమిలి - తగరపువలస రహదారి

భీమునిపట్నం: భీమిలి నుంచి తగరపువలసకు వెళ్లే మార్గంలో దెబ్బతిన్న రోడ్డు ప్రాంతంలో అధికారులు కొత్తగా రహదారి నిర్మించడంతో అందరికీ ఎంతో సదుపాయంగా మారింది. అయిదు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ మార్గంలో చాలా చోట్ల రోడ్డు గతంలో బాగా దెబ్బతింది. గత ప్రభుత్వ హయాంలో ప్యాచ్ వర్క్‌లు చేసినా నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కొంత కాలానికే గోతులమయమైంది. ఈ మార్గంలోని కీతిన్‌పేట, రాయపాలెం, జీరుపేట ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద కూడా రోడ్డు బాగా దెబ్బతింది. ఈ మార్గంలో రోజూ భారీగా ద్విచక్ర వాహనాలు, ఆటోలతోపాటు ఇతర వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల వద్ద వేగంగా వస్తున్న వాహనాలు పలు సందర్భాల్లో అదుపు తప్పడంతో ప్రమాదాలు జరగడంతో పలువురు గాయాలపాలయ్యారు. కొందరు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో రూ.40 లక్షలతో అవసరమైన చోట కొత్తరోడ్డు నిర్మాణానికి అధికారులు పనులు ప్రారంభించారు. పది రోజుల్లో అవసరమైన అన్ని ప్రాంతాల్లోనూ నాణ్యతతో కూడిన రోడ్డు వేశారు. దీంతో ఇప్పుడు భీమిలి నుంచి తగరపువలస వరకు వాహనదారులు ఎంతో సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. చక్కగా రోడ్డు నిర్మించడంతో పలువురు ప్రభుత్వాన్ని ప్రశంసించడంతోపాటు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

15 నుంచి పోలమాంబ మహోత్సవాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు పెదరుషికొండ, చిన్నరుషికొండ గ్రామ దేవత శ్రీ పోలమాంబ అమ్మవారి మహోత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15న మరిడిమాంబ అమ్మవారి పండగతో ప్రారంభమై, 18న పోలమాంబ అమ్మవార్ల అనుపుతో ముగుస్తుంది. నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

14 నుంచి సమర శంఖారావం

తగరపువలస: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను నిరశిస్తూ ఈ నెల 14 నుంచి 30 వరకు సీపీఐ, సీపీఎం సమర శంఖారావం నిర్వహించనున్నట్టు ఆ పార్టీల నాయకులు ప్రకటించారు. చిట్టివలస సిటు కార్యాలయంలో నాయకులు సోమవారం సమావేశమయ్యారు. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ఎన్నడూ లేని విధంగా దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, కానూరి రాంబాబు, ఎస్.అప్పలనాయుడు, అల్లు బాబూరావు, రవ్వ నరసింగరావు, మావూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.